
సాక్షి
పల్నాడు
శనివారం । 25 । జనవరి । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 556.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,567 క్యూసెక్కులు విడుదలవుతోంది.



83,066 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు 75,159 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 83,066 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

కొనసాగుతున్న నీటి విడుదల



మాచర్ల : నాగార్జున సాగర్ కుడి కాలువకు గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం 22 అడుగుల ఎత్తులో విడుదల కొనసాగిస్తూ... సాగు, తాగు నీరు అందిస్తున్నారు. మార్చి నెల వరకు విడుదల చేయనున్నారు.

నాటక వేదికగా అతివకు అందలం

- రేపు 'తెలుగు నాటకం- స్త్రీవాదం'పై సదస్సు
- యడ్లపాడుకు రానున్న సాహిత్య, నాటక రంగ ప్రముఖులు
- 250 మందికిపైగా విద్య, సాహిత్య, సాంస్కృతిక రంగ ప్రతినిధులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు సదస్సుల్లో చర్చాగోష్టి

యడ్లపాడు: 'తెలుగు నాటకం- స్త్రీవాదం'పై ఈ నెల 26వ తేదీన మేధోమథనం జరగనుంది. ఈ సదస్సుకు సాహితీ ప్రముఖులు, నాటకరంగ ఉద్దండులు హాజరుకానున్నారు. ఇందుకు యడ్లపాడు మండలం వేదిక కానుంది. కేంద్ర సాహిత్య అకాడమీ, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల వేదిక (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఈ కార్యక్రమం నిర్వహణకు రంగం సిద్ధమైంది. వేదిక అధ్యక్షులు ముత్తవరపు సురేష్ బాబు అధ్యక్షత జరిగే కార్యక్రమానికి తెలుగు నాటకరంగంలో అపార అనుభవం గడించిన మేధావులు, మహిళా జాగృతికై తమ అక్షరగళంతో పోరాడుతున్న సాహిత్య పురస్కార గ్రహీతలు, విద్యా, సాంస్కృతిక రంగాల్లోని ప్రముఖులు, నాటక దర్శక, రచయితలు, కళాకారులు, స్త్రీవాద రచనలు చేసే కవులు, రచయితలు, వక్తలు సుమారు 250 మందికిపైగా భాగస్వాములు కానున్నారు. 'తెలుగునాటక రంగం–స్త్రీవాదం'పై తమ కలాలతో, గళాలతో జనజాగృతి చేయనున్నారు.



హాజరయ్యే ప్రముఖులు వీరే...

డాక్టర్ ఓల్గా



ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీవాదానికి బలమైన పునాదులు వేసిన రచయిత్రులలో ఓల్గా ఒకరు. 'స్వేచ్ఛ', 'తోడు' వంటి నవలలతోపాటు స్త్రీవాదాన్ని ప్రతిబింబించే వందలాది కథలను రచించారు. కేంద్రసాహిత్య పురస్కారంతో పాటు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న ఈమె కీలకోపన్యాసం చేయనున్నారు.

నల్లూరి రుక్మిణి



ఎన్నో సామాజిక ఉద్యమాలలో పాల్గొన్న రుక్మిణి.. మేరువు నెరదు, జ్ఞానం అందరిదీ వంటి నవలలతోపాటు వందలాది వ్యాసాలను రచించారు. స్త్రీవాదన నేపథ్యంలో సాహిత్యపరంగా చైతన్యం చేస్తున్న ఈమె వృత్తిరీత్యా న్యాయవాది. సదస్సులో స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యంపై చైతన్యం తీసుకురానున్నారు.

పిన్నమనేని మృత్యుంజయరావు



అనగనగా, రాతిలో తేమ, ఆస్తికులు, గురితప్పిన వేటు, అసత్యం వంటి నాటికలు, కథలు, నవలలు రచించారు. వర్తమాన నాటక రంగంలో రచయితగా గుర్తింపు పొందిన ఈయన రెండో సదస్సుకు అధ్యక్షత వహిస్తారు.

వల్లూరు శివప్రసాద్...



'హంసధ్వని, వానప్రస్థం, మట్టి మనిషి, ఏకాకినౌక వంటి 30కిపైగా నాటకాలు, నాటికలు రచించారు. పరిషత్తులలో 200పైగా ఉత్తమ నాటక రచయిత పురస్కార గ్రహీతగా నిలిచారు. వందకుపైగా తన రచనల్ని 7 సంకలనాలుగా ముద్రించి, నాటక సాహిత్యానికి మహోపకారం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా, సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులుగా వ్యవహరిస్తున్న ఈయన స్వాగతోపన్యాసం చేయనున్నారు.

అంబటి మురళీకృష్ణ



తెలుగు సాహిత్యం, నాటక విశ్లేషకులుగా గుర్తింపు పొంది, బాపట్ల వివేక సంస్థ ద్వారా వందలాది సాహిత్య సభలను నిర్వహించారు. అనేక గ్రంథాలను ముద్రిస్తూ, నేడు పలు నాటక పరిషత్తులకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. ఈయన తొలి సదస్సుకు అధ్యక్షత వహిస్తారు.

డాక్టర్ జె. కనకదుర్గ



తెలుగు అధ్యాపకురాలిగా, ప్రిన్సిపల్‌గా సుదీర్ఘకాలం వ్యవహరించిన డాక్టర్ జె.కనకదుర్గ 'సింహాసనం, ద్వాత్రింశిక' వంటి తెలుగు కథ, కావ్యాలలో మహిళల జీవన చిత్రణ అంశాలపై విస్తృత పరిశోధన చేశారు. అనేక గ్రంథాలను, వ్యాస సంకలానాలు, స్త్రీవాదంపై సాధికారకత గ్రంథాలను రచిం చారు. స్త్రీ వైవాహిక సమస్యల చిత్రీకరణపై ఉపన్యసించనున్నారు.

పి.ఎ. దేవి



రంగస్థలం ఆధునిక వీధి నాటికలను 20కి పైగా రచించి, దర్శకత్వం వహించారు. సామాజిక విశ్లేషకురాలిగా గుర్తింపు పొందారు. జాతీయ, అంతర్జాతీయ నాటకోత్సవాలు, సదస్సుల్లో ప్రసంగించారు. స్త్రీ వికాసంపై ఆమె అవగాహన కల్పిస్తారు.

డాక్టర్ సీహెచ్ సుశీలమ్మ



తెలుగు అధ్యాపకురాలు, ప్రిన్సిపల్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన డాక్టర్ సుశీలమ్మ.. ముళ్ళపూడి వెంకటరమణ రచనలపై పరిశోధన చేసి గౌరవ డాక్టరేట్ పొందారు. స్త్రీవాద నేపథ్యంగా యూజీసీ ప్రాజెక్టుల ద్వారా పరిశోధనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో తెలుగు సాహిత్యంపై పత్ర సమర్పణ చేసిన ఆమె.. ఈ సదస్సులో స్త్రీ చిత్రణపై పత్ర సమర్పణ చేయనున్నారు.

డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు



బహుముఖ ప్రజ్ఞాశాలి, నాటక రచయిత, పరిశోధకుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు 17 నాటకాలు, పలు నాటికలను రచించారు. 'తెలుగు నాటక రంగంలో నూతన ధోరణులు–ప్రయోగాలు', అలాగే గుంటూరు జిల్లా నాటకంగా చరిత్ర వంటి అంశాలను పరిశోధన చేశారు. నాటక రంగంపై పది గ్రంథాలను రచించిన వీరు స్త్రీ చైతన్యంపై జనజాగృతి చేయనున్నారు.

డాక్టర్ విభానుపుడి సుబ్బరాజు



శతాధిక పద్య నాటకాలను ప్రదర్శించిన రంగస్థల నటుడు. సురభి నాటక రంగంపై పరిశోధన చేసి గౌరవ డాక్టరేట్ పొందారు. వృత్తిరీత్యా తెలుగు అధ్యాపకులైన ఆయన పద్య నాటకంపై అనేక జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. ఈ సదస్సులో స్త్రీ అభ్యుదయంపై ఉపన్యసిస్తారు.

గర్భం దాల్చిన హాస్టల్ బాలిక

- బాధితురాలి పరిస్థితి విషమం
- విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు



నరసరావుపేట టౌన్: ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపంతో కింది స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఓ బాలిక పాలిట శాపంగా మారింది. చదువుకునే వయసులో ఆమె గర్భం దాల్చి ప్రస్తుతం చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల హాస్టల్‌లో బాలిక గర్భం దాల్చిన ఘటన కలకలం రేపింది. ఆమెను వైద్యసేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై శిశుసంక్షేమ శాఖ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. పల్నాడు జిల్లా దుర్గి ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక నరసరావుపేట పెద్ద చెరువులోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ పిడుగురాళ్లలోని ఓ కళాశాలలో చదువుతోంది. శుక్రవారం ఉదయం తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను హాస్టల్ సిబ్బంది ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలిక పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె గర్భం దాల్చినట్లు సమాచారం. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బి. శివనాగేశ్వరరావు, ట్రిబుల్ వెల్ఫేర్ అధికారి ఎ.జ్యోత్స్న, ఐసీడీఎస్ పీడీ ఆర్.కుముదిని, సీడీపీవో ఉమా మహేశ్వరి హాస్టల్‌ను సందర్శించారు. జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. ఇతర విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

న్యూస్‌రీల్

28న జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఎస్ఎసీ ట్రైనింగ్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు శుక్రవారం తెలిపారు. జాబ్ మేళాకు కోర్ ఇంటిగ్రా, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ కార్డ్స్, ఫాక్స్‌కాన్, డీమార్ట్ వంటి సంస్థలు హాజరవుతాయని వివరించారు. జాబ్ మేళాకు ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ, పీజీ చదివిన నిరుద్యోగ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటాతో నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు వీరాంజనేయులును 91602 00652, వై.శ్రీనివాసరెడ్డిని 99084 82907 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. పల్నాడు జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని కోరారు.

ఉపకులాలవారీగా మద్యం దుకాణాల కేటాయింపు



నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లాలో గీత ఉప కులాలకు మద్యం దుకాణాల కేటాయింపునకు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు లాటరీ తీసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లాటరీ పద్ధతి ద్వారా కేటాయింపు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 330 దుకాణాలు గీత కులాలకు కేటాయించగా, పల్నాడు జిల్లాలో 13 షాపులు ఇచ్చారన్నారు. 4 దుకాణాలు గౌడ్, 9 దుకాణాలు గౌడ ఉపకులాలకు కేటాయించారని తెలిపారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తి అయిన తర్వాత లాటరీ విధానంలో దుకాణాల కేటాయింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గోవర్ధనస్వామి ఆలయంలో విశేష కుంకుమార్చన



తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత గోవర్ధనస్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం విశేష కుంకుమార్చన నిర్వహించారు. 211 మంది సువాసినులతో వేద పండితులు రఘు, మాధవ, కేశవలు ఈ పూజను జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి మల్లీశ్వరి అనుమతితో శ్రీహరినామ సంకీర్తన బృందం గురువు పెరవలి వంశీకృష్ణ నేతృత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం కార్యదర్శి ఈ. అమ్మడు నిర్వహణలో జరిగింది. లోక కల్యాణార్థం చేసిన ఈ కుంకుమార్చన ఫలితంగా మనసులో ఉన్న కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. కార్యక్రమంలో అందె బాలచంద్ర మౌళి, మాదాల సాయి హనుమంతరావు, నందికంటి రామాంజనేయులు, సంకీర్తన బృందం మాదాల నాగఅర్చన, అందె రాజేశ్వరి, తన్మయి, తూనుగుంట్ల దుర్గా మల్లేశ్వరి, కొప్పురపు అనిత మాధవి, దంటు శర్వాణి, నందికంటి జయలక్ష్మి, శ్రీపూజిత, కొత్తమాసు పుష్పలత, తన్నీరు శివశంకర్ పాల్గొన్నారు

27న గణపతి సచ్చిదానంద స్వామీజీ రాక



నగరంపాలెం: చౌడవరంలోని దత్తనాథ క్షేత్రం ఆశ్రమానికి ఈనెల 27న శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, ఉత్తరాధిపతి శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ విచ్చేస్తున్నారని ట్రస్టీ బి.సీతారామిరెడ్డి తెలిపారు. మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ట్రస్టీ డాక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ గణపతి సచ్చిదానంద స్వామీజీ 56 రోజులు విశ్వ ధర్మ ప్రచారం పేరుతో ఏపీలో పర్యటిస్తున్నారని చెప్పారు. 27వ తేదీ సాయంత్రం ఆశ్రమానికి రానున్నట్లు తెలిపారు. 28న ఉదయం గోపూజ, శ్రీ చక్రార్చన, హోమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆంజనేయ రాగసాగర 'నాద ధ్యాన చికిత్సా కచేరి' ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ పి.గోపీకృష్ణ, ట్రస్టీలు మిట్టపల్లి రాజేంద్రబాబు, వి.డి.గాంధీ, బి. జయలక్ష్మి పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు నూతన గ్రౌండ్

సుమారు ఐదున్నర ఎకరాల్లో రూ.కోటి వ్యయంతో పనులు

నరసరావుపేట: సుమారు మూడేళ్ల క్రితం ఏర్పడిన పల్నాడు జిల్లా కలెక్టరేట్ సమీపంలో రిపబ్లిక్ డే వేడుకలు, ఇతర ఉత్సవాలను నిర్వహించేందుకు సుమారు ఐదున్నర ఎకరాల్లో చేపట్టిన గ్రౌండ్ సిద్ధమవుతోంది. సుమారు రూ.కోటి వ్యయంతో నూతనంగా ప్రహరీ నిర్మించి, స్థలాన్ని చదును చేసి వేదికను నిర్మిస్తున్నారు. దీనిలోకి రాకపోకలు సాగించేందుకు కలెక్టరేట్ నుంచి, వేదిక పక్కగా ఉన్న రోడ్లను బీటీ రోడ్లుగా మారుస్తున్నారు. శుక్రవారం ఈ పనులను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డీఆర్వో ఏకా మురళి, ఇతర అధికారులు పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ వేణుగోపాలరావు ఈ గ్రౌండ్ పనులను పర్యవేక్షిస్తున్నారు. రెండేళ్ల నుంచి రిపబ్లిక్‌డే వేడుకలను సత్తెనపల్లిరోడ్డులోని శ్రీ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో నిర్వహించేవారు, ఇది వ్యయప్రయాసలకు దారితీస్తుండటంతో కలెక్టర్‌కు ప్రభుత్వం కేటాయించిన 27ఎకరాల భూమిలోని ఐదున్నర ఎకరాలను రెవెన్యూ, పోలీసు విభాగాలు అన్ని కార్యక్రమాలు నిర్వహించుకునేలా తీర్చిదిద్దుతున్నారు. దీనికి కావాల్సిన విద్యుత్ సౌకర్యాలను ఆ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు.



గ్రౌండ్‌లో వేదిక పనులను పరిశీలిస్తున్న డీఆర్వో మురళి తదితరులు

సాగర్‌కు మరో విమానాశ్రయం

- త్వరలో నిర్మాణానికి చురుగ్గా సన్నాహాలు
- ఇప్పటికే భూములు పరిశీలించిన అధికారులు

విజయపురి సౌత్: ప్రముఖ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌లో నూతన విమానాశ్రయం రానుంది. ఇది సిద్ధమైతే సాగర్‌కు మహర్దశ పట్టనుంది. 1955లో ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా నెహ్రూ, ఇందిరాగాంధీ, ఇతర ప్రముఖుల రాక కోసం చిన్న పాటి విమానాశ్రయం (ఎయిరోడ్రోమ్) నిర్మించారు. 1967లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రారంభమైంది. తరువాత ఈ విమానాశ్రయాన్ని పట్టించుకోకపోవటంతో రన్‌వే శిథిలమైంది. 2010లో హైదరాబాద్‌కు చెందిన ఫ్లైటెక్ ఏవియేషన్ అనే ప్రైవేట్ సంస్థ ఈ విమానాశ్రయాన్ని పైలెట్ శిక్షణ కోసం లీజ్‌కు తీసుకుంది. రన్‌వే రెన్నోవేషన్ చేసి చిన్నపాటి విమానాలు (సెస్నా 142, 172) దిగేందుకు అనుకూలంగా మార్చింది. ఇప్పుడు నాగార్జున సాగర్‌లో నూతన విమానాశ్రయం నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో ఈ విమానాశ్రయంలో పలు సినిమా షూటింగ్‌లు జరిగాయి. జూనియర్ ఎన్టీఆర్ నటించిన బాద్‌షా, సాయి ధరమ్ తేజ్ నటించిన సుబ్రహ్మణ్యం ఫర్ సేల్, ఆది నటించిన ప్రేమ కావాలి, ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి కుమారుడు శ్రీ సింహా కొడూరి నటించిన ఉస్తాద్ వంటి పలు సినిమా షూటింగ్‌లు ఇక్కడ చేశారు.

భూముల పరిశీలన

ఇక్కడ నూతన విమానాశ్రయం పూర్తి అయితే పర్యాటకులు పెరిగే అవకాశం ఉంటుంది. నాగార్జునకొండ, అనుపు, ఎత్తిపోతలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం వంటి ప్రదేశాలకు సందర్శకులు పెరిగే అవకాశాలున్నాయి. దీంతో పాటు హైదరాబాద్‌కు కేవలం 150 కిలోమీటర్లు ఉన్న ఈ విమానాశ్రయంలో మరిన్ని సినిమా షూటింగ్‌లు జరిగే అవకాశాలు ఉన్నాయి. తాజాగా ఈ నెల 23న ఢిల్లీకి చెందిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని జాయింట్ జనరల్ మేనేజర్ ఏఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల బృందం నూతన విమానాశ్రయానికి కావాల్సిన భూములను గురజాల ఆర్డీవో వి.మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. మాచర్ల మండలంలోని విజయపురి సౌత్, పశువేముల, చింతలతండా, నాగులవరం గ్రామాలలో ప్రతిపాదించిన సుమారు 1,600 ఎకరాల భూములను పరిశీలించింది. దీనిపై నివేదికను సిద్ధం చేశారు. సరిహద్దు ప్రాంతంలో నూతన విమానాశ్రయం పూర్తి అయితే ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణకు కూడా పర్యాటక పరంగా మేలు జరగనుంది.



నాగార్జున సాగర్‌లోని విమానాశ్రయం

మచ్చే కదా అని వదిలేస్తే ముప్పే

శరీరంపై స్పర్శ లేని మచ్చలు, పొడలు ఉన్నాయా? అయితే తేలిగ్గా వాటిని తీసిపారేయొద్దు. ఎందుకంటే ఆ మచ్చలతోనే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. శరీరంపై ఎక్కడ మచ్చలు ఉన్నా మొహమాట పడకుండా వైద్య సిబ్బందికి చూపించాలి. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కింద చేపట్టిన కార్యక్రమంలో వైద్యులకు చెప్పాలని సూచిస్తున్నారు.

- జిల్లాలో కుష్ఠు నిర్ధారణ సర్వే
- మచ్చలుంటే చూపించాలంటున్న వైద్యులు
- జిల్లాలో 802 మంది అనుమానిత లక్షణాలు

సత్తెనపల్లి: జిల్లాలో కుష్టు వ్యాధిని నిర్మూలించడానికి యంత్రాంగం చర్యలు చేపట్టింది. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి సిబ్బందిని పంపి వ్యాధి నిర్ధారణ సర్వే ప్రారంభించింది. అనుమానిత మచ్చలు, పొడలు శరీరంపై ఉంటే నిర్భయంగా ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందికి తెలియచేయాలని అధికారులు కోరుతున్నారు. జిల్లాలో 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 25 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.



గుడిపూడిలో సర్వేలో డీపీఎంఓ నాగేశ్వరరావు నాయక్

ఇంటింటి సర్వేలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 22,33,723 మందిని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పరిశీలించనున్నారు. ఈ కుష్టు నిర్ధారణ సర్వే ఈ నెల 20 నుంచి ప్రారంభం కాగా, ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగనుంది. ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద వలంటీర్లు సర్వే చేసేందుకు ఇంటింటికి వెళుతున్నారు. అవసరమైతే వైద్యాధికారులు సర్వేలో పాల్గొంటారు.

వివరాలన్నీ ఆరా తీస్తూ..

శరీరంపై మచ్చలు, అధిక మోతాదులో పొడలు ఉంటే సిబ్బంది వైద్యాధికారుల దృష్టికి తీసుకు వెళ్తారు. వైద్యాధికారులు అనుమానిత లక్షణాలున్న వ్యక్తిని పరిశీలించి కుష్టు వ్యాధి అవునో ... కాదో నిర్ధారణ చేస్తారు. ఒకవేళ కుష్టుగా తేలితే సంబంధిత వ్యక్తి పేరును రిజిస్టర్ చేసుకొని చికిత్స ప్రారంభిస్తారు. కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియా లెప్రే వల్ల వస్తుంది.ప్రతి నాలుగు నెలలకోసారి ఇంటింటి సర్వే చేయడంతో పాటు త్వరితగతిన వ్యాధిగ్రస్తులను కనుగొని చికిత్స ఇవ్వడం ద్వారా అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చు. వ్యాధికారక బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించిన ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపల వ్యాధి లక్షణాలు బయట పడతాయని వైద్యాధికారులు తెలిపారు.

ఎండీటీ మందులతో వ్యాధి నయం...

బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ) ద్వారా కుష్టువ్యాధి పూర్తిగా నయమవుతుంది. ప్రారంభ దశలో గుర్తించి సక్రమంగా చికిత్స చేయించుకుంటే వ్యాధితో పాటు అంగవైకల్యం రాకుండా నివారించవచ్చు. ఆరు నెలల నుంచి 12 నెలలపాటు ఎండీటీ మందులతో చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుంది.

వ్యాధి లక్షణాలు ఇవే...

- చర్మంపై పాలిపోయిన రాగి వర్ణంతో కూడిన స్పర్శ లేని మచ్చలు ఉండడం.
- కుష్టు వ్యాధి సంబంధిత మచ్చలపై చెమట పట్టకపోవడం.
- కనుబొమ్మలు లేదా వెంట్రుకలు రాలిపోవడం.
- ముఖంపై చర్మం నూనె రాసినట్టు నిగనిగలాడుతుంది.
- కాళ్లు, చేతులపై స్పర్శ జ్ఞానం లోపించడం.
- ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం.
- కాళ్లు, చేతులు తిమ్మిర్లు, అరికాళ్లు, చేతులకు స్పర్శ లోపించడం.
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం.
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం.
- వేళ్లు వంకర్లు తిరగడం.

జిల్లా సమాచారం

జిల్లాలో ఇంటింటి సర్వే : జనవరి 20 -ఫిబ్రవరి 02	జిల్లాలో స్క్రీనింగ్ చేయాల్సింది: 22,33,723 మంది
జిల్లాలో మండలాలు : 28	స్క్రీనింగ్ చేయించుకున్న వారు: 2,65,577 మంది
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 38	జిల్లాలో అనుమానితులు: 802 మంది
అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 25	చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులు: 120 మంది
ఇంటింటి సర్వే బృందాలు: 1,521	

సర్వే సిబ్బందికి సహకరించాలి

ఇంటింటి సర్వే చేయడానికి వస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందికి ప్రజలు సహకరించాలి. శరీరంపై ఎలాంటి మచ్చలున్నా మొహమాటం లేకుండా సిబ్బందికి చెప్పాలి. వ్యాధి నిర్ధారణ జరిగినా భయపడాల్సిన పని లేదు. ఎండీటీ మందులు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుంది.

– డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా లెప్రసీ అధికారి, పల్నాడు జిల్లా

తొలిమంచులో ధ్యానబుద్ధుడు





అమరావతి మెయిన్ రోడ్డులో కమ్మేసిన పొగమంచు

అమరావతి: ధ్యాన బుద్ధుడి విగ్రహం శుక్రవారం ఉదయం తొలి మంచుతెరల నడుమ సరికొత్త అందాలతో శోభిల్లింది. పుణ్యక్షేత్రమైన అమరావతి గ్రామాన్ని శుక్రవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. కాస్త దూరంలో ఉన్న వారు కూడా కనపడనంతగా మంచు ఆవరించింది. వాహనదారులు తక్కువ వేగంతో హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణించారు. వాహనాలు కనపడక అనేక అవస్థలు పడ్డారు.

క్లుప్తంగా

విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు

నరసరావుపేట ఈస్ట్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాల్లో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. జిల్లా పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి 152 మంది హాజరయ్యారు. క్విజ్‌లో టి.జగన్‌మోహన్‌రెడ్డి, కె.హిమ ఆదిత్య (జడ్పీ హైస్కూల్, గణపవరం) ప్రథమ, కె.హేమంత్‌సాయిరెడ్డి, సీహెచ్ అశోక్‌రెడ్డి (75తాళ్లూరు) ద్వితీయ స్థానం సాధించారు. పాటల పోటీలో జె.బ్లెస్సీ, ఇ.అక్ష (75తాళ్లూరు), వై.శ్రీహేమలత (వేల్పూరు), వక్తృత్వంలో ఎం.లక్ష్మీపూర్ణిమ (గణపవరం), ఎం.నీలా నాయక్ (వెల్లటూరు), వ్యాసరచనలో ఎ.మహాలక్ష్మి (ఉప్పలపాడు), ఎ.అజయ్‌కుమార్ (మాచర్ల), చిత్రలేఖనంలో జె.శృతి (సత్తెనపల్లి), ఎ.అనుష్క (సత్తెనపల్లి), స్కిట్‌లో సాయికృష్ణ (వేల్పూరు), షేక్.షర్మిల (మాచర్ల) బహుమతులు సాధించారు. విజేతలకు ఈ నెల 25న ఓటరు దినోత్సవ సభలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు.

నల్లతామర తెగులు అరికట్టేందుకు చర్యలు




అచ్చంపేట: మిర్చి పంటపై దాడి చేసే నల్లతామర తెగులు పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులు సంబంధిత శాఖల అధికారులు సూచించిన పద్ధతులను పాటించాలని ఉద్యాన శాఖాధికారిణి శ్రీనిత్య తెలిపారు. మండలంలోని చిగురుపాడులో శుక్రవారం ఆమె మిర్చి పంటలను పరిశీలించారు. నల్లతామర తెగులు నివారణకు తెలుపు, బుసుగు జిగురు అట్టలను పొలంలో అక్కడక్కడ ఉంచాలన్నారు. జిగురు అట్టలకు పురుగులు అతుక్కుని నశిస్తాయని చెప్పారు. కాయకుళ్లు నివారణకు టిబుకోనజోల్ 2ఎంల్ మందును లీటరు నీటిలో కలిపి మొక్కలు బాగా తడిసే వరకు పిచికారీ చేయాలని సూచించారు. ఆమె వెంట రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

పల్నాడుకే పెద్ద పండుగ

- ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు
- 28న స్వామి వారి వార్షిక రథయాత్రకు సర్వం సిద్ధం
- మహిళా భక్తులతో ప్రధాన కలశ శోభయాత్ర
- నేటి నుంచి ప్రత్యేక పూజలు



సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం



ప్రత్యేక అలంకరణలో స్వామి

పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతానికే పెద్ద పండుగగా శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల పేరుగాంచింది. నిరంతర హోమాలతో నాలుగు రోజులపాటు స్వామివారి పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచే ప్రత్యేక పూజలతో తిరునాళ్ల మొదలవుతుంది. అప్పటి నుంచి 28వ తేదీ వరకు వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

ఇదీ చరిత్ర..

ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో 2007 జనవరి 28వతేదీన వైభవంగా విగ్రహ ప్రతిష్ట చేశారు. అప్పటి నుంచి ఏటా మూడు రోజులపాటు పూజలు, హోమ యజ్ఞాలు, అభిషేకాలు వంటివి నిర్వహిస్తున్నారు. 2015లో రథం, 2011లో రథశాలను ఏర్పాటు చేశారు. 2014లో సుమారు 50 అడుగుల ఎత్తుతో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 2015లో గాలిగోపురం నిర్మాణం, 2016లో అద్దాల మండపం ఏర్పాటు చేశారు. పెద్ద పండుగ కావటంతో ప్రభుత్వ పాఠశాలలకు, ప్రైవేటు వ్యాపార సంస్థలకు సెలవు ప్రకటించటం ఇక్కడ అనవాయితీగా మారింది. పెద్ద ఎత్తున అన్నదానం చేస్తుంటారు. పట్టణ పోలీసులు బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నారు.

రోజువారీ కార్యక్రమాలివీ..

25న సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం,రక్షాబంధనం, అంకురారోపణ, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి వంటి కార్యక్రమాలు ఉంటాయి. 26న ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, ఆరాధన, మంగళాశాసనం, మూలవిరాట్‌కు అభిషేక మహోత్సవం, అగ్ని ప్రతిష్ట, చతుస్తానార్చన, వేద విన్నపములు, మూలమూర్తి మంత్ర హవనములు, అష్టోత్తర శతనామార్చన , నిత్య పూర్ణాహుతి జరుగుతాయి. ఉదయం 9 గంటలకు శ్రీ వాసవీ అమ్మవారి దేవస్థానం నుంచి మహిళలచే శోభయాత్ర, పంచముఖ ఆంజనేయస్వామి వారికి వివిధ నదీ జలాలతో అభిషేకము ఉంటాయి. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, చతుస్థానార్చన, మన్యు సూక్త హవనము, సహస్రమార్చం, నిత్య పూర్ణాహుతి, వేద విన్నపాలు, తీర్థప్రసాద గోష్టి నిర్వహిస్తారు. 27 ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలము, మంగళా శాసనము, వేదవిన్నపాలు, మూలమంత్ర, మూర్తి మంత్ర వాహనాలు, మన్యు సూక్త వచనము, నిత్య పూర్ణాహుతి, వేదవిన్నపాలు, తీర్థప్రసాదాల వినియోగము, 28వ తేదీ సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలము, మంగళా శాసనము, చతుస్థానార్చన, శాంతిపాఠం, వేదవిన్నపాలు, ద్వారా తోరణబలి, మహాపూర్ణాహుతి, కుంభయాత్ర, మహా కుంభప్రోక్షణ, శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, స్వామివారి అనుగ్రహ భాషణము, ఆచార్య సత్కారం, మహా అన్నదాన కార్యక్రమం, రథోత్సవం ఉంటాయి. చుట్టు పక్కల జిల్లాలు, తెలంగాణ నుంచి కూడా భక్తులు విశేషంగా హాజరవుతుంటారు .



మంచు దుప్పటిలో లైమ్ సిటీ

పిడుగురాళ్ల: లైమ్‌సిటీలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. శుక్రవారం పొగమంచు దుప్పటి కప్పేసింది. ఎదురుగా ఉన్న మనిషి సైతం కనిపించలేదు. ఉదయం 11 గంటల వరకు మంచు ఉంది. రహదారిపై వాహనచోదకులు సైతం లైట్లు వేసుకొని నడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం ఎవరైనా రోడ్డుపై నడిచి వస్తే వెంటనే వారి తలపై నీటి బిందువులు దర్శనమిస్తున్నాయి.

గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం



కారెంపడి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాజ్‌భవన్‌లో ఇవ్వనున్న తేనీటి విందుకు హాజరు కావాల్సిందిగా కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి)కి శుక్రవారం ఆహ్వానం అందింది. జాజిని ఫారెస్ట్‌మేన్‌గా అభినందిస్తూ ఆయన అడవుల సంరక్షణకు చేస్తున్న కృషిని, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులను, ప్రజలను చైతన్యవంతం చేస్తున్న విషయాన్ని గుర్తించి ఆహ్వానం పలికారు. ఇప్పటికే ప్రముఖ దినపత్రికలతోపాటు నేషనల్ మీడియాలో కూడా జాజిని ప్రశంసిస్తూ పలు కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కూడా గవర్నర్ ఇచ్చిన విందుకు జాజి హాజరయ్యారు.

తురకా కిషోర్ సోదరులకు రిమాండ్

మాచర్ల: మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్‌ను మరోసారి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం హాజరు పరిచారు. ఇప్పటికే టీడీపీ కార్యాలయంపై దాడి కేసుతోపాటు, పలు సెక్షన్ల కింద ఆయన్ను అరెస్టు చేసిన పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. అయితే పీటీ వారంట్ వేసి తురకా కిషోర్‌తోపాటు, ఆయన సోదరుడు శ్రీకాంత్‌ను వారంట్‌పై శుక్రవారం తీసుకొచ్చి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. క్రైమ్ నంబరు 79 కేసులో తురకా కిషోర్, అతని సోదరుడు శ్రీకాంత్‌లను నిందితులుగా చూపించారు. ఇరువురిని ఫిబ్రవరి 7వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. వీరివురిని నెల్లూరు జైలుకు పోలీసులు తరలించారు.

నరాల బలహీనతతో పలు వ్యాధులు



తెనాలి: నరాల బహీనతతో మారిపోయే నడక, చేతులు కదలిక, తల తిరగడం వంటి వ్యాధులను సకాలంలో కనుగొనవచ్చని, తగిన చికిత్సతో నయం చేయొచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్, గుంటూరు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ సుందరాచారి చెప్పారు. తెనాలికి చెందిన ప్రవాస భారతీయ వైద్యురాలు వడ్లమూడి సీతారామమ్మ స్మారకంగా ఐఎంఏ, తెనాలి శాఖలో ఏర్పాటు చేసిన బంగారు పతకాన్ని తొలిగా డాక్టర్ సుందరాచారికి ప్రదానం చేశారు. స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సీతారామమ్మ భర్త డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి, ఐఎంఏ, తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్ బంగారు పతకాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుందరాచారి 'స్పెక్ట్రమ్ ఆఫ్ మూమెంట్ డిజార్డర్స్' అనే అంశంపై డాక్టర్ సీతారామమ్మ స్మారక ప్రసంగం చేశారు. డాక్టర్ అనిల్‌కుమార్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.మధుప్రభాకర్‌బాబు మాట్లాడారు. ఐఎంఏ ఉపాధ్యక్షురాలు డాక్టర్ పావని ప్రియాంక, సంయుక్త కార్యదర్శి డాక్టర్ చందు ఉదయ్, కోశాధికారి డాక్టర్ శ్యాంప్రసాద్, సీనియర్ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి, చందు సాంబశివుడు, సోమశేఖర్, భానుప్రసాద్, సాంబశివరావు, విశ్వమోహనరావు, శేషగిరిరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైల్వే ఇంజనీరింగ్ సిబ్బంది నిరసన



లక్ష్మీపురం: పట్టాభిపురంలోని రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంలో శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే ఇంజనీరింగ్ సిబ్బంది శుక్రవారం నిరసన తెలిపారు. ముందుగా డీఆర్‌ఎం రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలోరై ల్వే మజ్దూర్ యూనియన్ గుంటూరు డివిజన్ అధ్యక్షుడు మంజునాథ్, కార్యదర్శి ఎం.వి ప్రసాద్ మాట్లాడారు. ఓపెన్ లైన్ సిబ్బందికి రిస్క్, హార్డ్‌షిప్ అలవెన్సు చెల్లించాలని, పాయింట్స్‌మెన్ కేటగిరీకి నాలుగు గ్రేడ్ పేలను మంజూరు చేయాలని కోరారు. రూ.4,800, రూ.5,400, రూ.6,600 గ్రేడ్ పే కలిగిన గెజిటెడ్ ఉద్యోగులందరకూ నైట్ డ్యూటీ అలవెన్స్‌ను ఇవ్వాలని తెలిపారు. యూపీఎస్‌లో మార్పుల చేసి పాత పింఛన్ విధానంలో మాదిరిగా ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం లాభాలు చేకూర్చాలని విన్నవించారు. కరువు భత్యం 50శాతానికి పెరిగినందున రన్నింగ్ అలవెన్సులో పెంపుదల చేయాలన్నారు. నిలుపుదల చేసిన డీఏ, డీపీల బకాయిలను సత్వరమే చెల్లించాలని కోరారు. యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శులు కరుణశ్రీ , కోటేశ్వరరావు మాట్లాడుతూ బోనస్ చెల్లింపు విషయంలో ప్రస్తుతం నిర్ధారించిన రూ.7వేలు నెలసరి వేతన పరిమితిని తీసి వేసి ఉద్యోగులు పొందుతున్న వేతనంపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చెల్లిస్తున్న చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్సును పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు పొడిగించాలని కోరారు. సమావేశంలో డివిజనల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోశాధికారి సాంబశివరావు, డివిజనల్ అధ్యక్షులు ఎ.వి.సుబ్బారావు, పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. మజ్దూర్ యూనియన్ కోశాధికారి కృష్ణయ్య, యూనియన్ నాయకులు రవిశంకర్, ఏడీఎస్ లావణ్య, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు కె.వి.ఎస్. ప్రసాద్ ప్రసంగించారు.

తగ్గిన ప్రధాన పంటల విస్తీర్ణం

లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్

గుంటూరు రూరల్: రాష్ట్రంలో ఖరీఫ్- 2024లో ప్రధాన పంటల విస్తీర్ణం తగ్గినట్లుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వై .రాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికత పద్ధతులను ఆచరించటం వల్ల ఉత్పత్తిలో గణనీయమైన లోటు నమోదు కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట కాలానికి సంబంధించిన ప్రధాన పంటలు కోత పూర్తి చేసుకుని మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నానాటికీ పెరిగిపోతున్న సాగు వ్యయం వల్ల ప్రస్తుత పంటల ధరలు రైతులకు నిరాశగానే మిగులుతున్నాయని వివరించారు. ముఖ్యంగా వాణిజ్య పంటలైన పత్తి, మిరప మార్కెట్ ధరలు బెంచిమార్కు ధరల కంటే సుమారు 3 శాతం నుంచి 5శాతం తక్కువగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. పెరిగిన ఉత్పత్తికి తోడు అధిక వర్షాల మూలంగా పంట నాణ్యత దెబ్బతినడం వల్ల గోదాములలో అధికమొత్తంలో సరుకు నిల్వ ఉండటం, ఈ ధరల పతనానికి కారణాలుగా చెప్పుకోవచ్చని తెలిపారు. కంది, పెసర విస్తీర్ణం పెరిగి, శనగ, మినుములు విస్తీర్ణం తగ్గిందని వివరించారు. ఆస్ట్రేలియా నుంచి పెరుగుతున్న శనగ దిగుమతులు, మయన్మార్ నుంచి దిగుమతి అవుతున్న కంది వల్ల ఈ పంటల ధరలు మరింత క్షీణిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పసుపు ధరలు పరోక్ష విపణిలో పెరుగుతున్నప్పటికీ, భారీగా ఉన్న నిల్వల కారణంగా ప్రత్యక్ష విపణిలో కొనుగోళ్లు మందంగా సాగుతున్నాయన్నారు. వేరుశనగ విస్తీర్ణం పెరిగినప్పటికీ రైతుకు కొంతమేర ధర ఆశాజనకంగానే ఉందని తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మద్దతు ధరకు పత్తిని కొనుగోలుచేయడంతో ఈ సీజన్‌లో రైతులకు కొంత ఊరట లభించినట్లుయిందని తెలిపారు. అంతర్జాతీయంగా పౌల్ట్రీ పరిశ్రమ నుంచి ఇంధనాల్ ఉత్పత్తి కోసం మొక్కజొన్నకు డిమాండ్ అధికమైనందువల్ల ధరలు ఆశాజనకంగా ఉన్నాయని వివరించారు. వరి పంటలో యాంత్రీకరణ వల్ల గింజలో తేమ శాతం అధికంగా ఉండటంతో, వ్యాపారులు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తునారని ఆమె వివరించారు.

అభ్యసనా ఫలితాలు వంద శాతం సాధించాలి

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



పెదమక్కెన ఎంపీపీ పాఠశాలలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సత్తెనపల్లి: విద్యార్థుల అభ్యసన ఫలితాలు రెండు నెలల్లో వంద శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పాఠశాల విద్యా ప్రణాళిక, ఆవాస ప్రాంత అభివృద్ధి ప్రణాళికల నిమిత్తం ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ శిక్షణను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్లానింగ్ ఆవశ్యకతను వివరించారు. ప్లానింగ్ ఉంటేనే ఆ మేరకు బడ్జెట్ వస్తుందన్నారు. బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులను సందర్శించి స్లో లెర్నర్ పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలన్నారు. ముందుగా సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామాన్ని సందర్శించారు. క్లస్టర్ రీ ఆర్గనైజేషన్‌లో భాగంగా మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు నిమిత్తం ఎంపీపీ స్కూల్(ఎల్ఈ), ఎంపీపీ స్కూల్ (ఎల్ఈ), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల యొక్క అభ్యాసన ఫలితాలు ఎలా ఉన్నాయో పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ముందుగా చిన్నారులు ఇంగ్లిషులో సంభాషించడం చూసి ఆయన అభినందించారు. పిల్లలు చేత పుస్తకంలోని బొమ్మలు చూపించి ఆంగ్లంలో అడుగ్గా.. టక్కున సమాధానం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ, సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఎ. శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు మాధవీలత, వెంకట్రావు, సునీత, క్యాథరిన్, రీసోర్స్ పర్సన్ పి.రవిచంద్ర, తదితరులు ఉన్నారు.

బాలికల చదువును ప్రోత్సహించాలి

నరసరావుపేట: బాలికలు ఉన్నతవిద్య చదువుకుని తల్లిదండ్రులు, జిల్లాకు మంచి పేరు తేవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం మహిళల సాధికారత అంతగా లేదని, ఇప్పుడు రాణిస్తున్నారని పేర్కొన్నారు. జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన శంకర భారతిపురం విద్యార్థులు చంద్రిక, రంగమ్మ, సౌమ్యలకు మెమెంటోలు ఇచ్చి సత్కరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కుముదిని సింగ్, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ బి.రవి, డీసీటీవో రేవతి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం కొనాలి



రైస్ మిల్లులో పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఐదు మండలాల వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెవీ నిబంధనల ప్రకారం రైతు వద్ద నుంచి ధాన్యం సేకరణ జరగాలని తెలిపారు. కొనుగోళ్లు జరుగుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. అనంతరం కారంపూడిరోడ్డులోని ఓ రైస్‌మిల్లులో ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఐదు మండలాల తహసీల్దార్లతో మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. ఐదు మండలాల్లో ఎన్ని గ్రామాలు రీసర్వే చేశారని ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నరసరావు పేటలో ఐపీ కలకలం

రూ.250 కోట్లకు ఇద్దరు వ్యాపారులు ఐపీ పెడుతున్నట్లు ప్రచారం

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఐపీ కలకలం రేగింది. వ్యాపారంలో దివాళా తీసిన ఇద్దరు ప్రముఖ వ్యాపారులు ఐపీ పెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామంతో వారికి నగదు, అప్పు ఇచ్చిన వ్యాపారులు కలవరపాటుకు గురవుతున్నారు. ఒకరు పొగాకు వ్యాపారం చేసి అనేక మంది ప్రముఖల వద్ద వడ్డీ రూపంలో పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నారు. వడ్డీ కలిపి సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుందని తెలిసింది. మరొకరు చిట్‌ఫండ్, రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసి పట్టణంలోని వైద్యులు, ఇతర వ్యాపార రంగ ప్రముఖల వద్ద పెద్దమొత్తంలో అప్పు చేశాడు. తీసుకున్న డబ్బులు సకాలంలో చెల్లించక పోవటంతో అనుమానం వచ్చి కొందరు నిలదీశారు. దీంతో విషయం బయటకు పొక్కింది. మొత్తం రూ.150 కోట్ల వరకు కట్టాల్సి ఉంటుందని బాకీ ఇచ్చిన వాళ్లు చెప్పుకొస్తున్నారు. ఇద్దరికీ పట్టణంలో విలువైన ఆస్తులు ఉన్నాయి. అయితే ఆస్తుల కన్నా అప్పులు ఎక్కువగా ఉన్నట్లు తెలియవచ్చింది. ఈ క్రమంలో అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. ఐపీ పెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇది తెలిసిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఐపీ పెట్టేందుకు సిద్ధమైన వ్యాపారుల తరఫున మధ్యవర్తులు రంగంలోకి దిగి.. ఆస్తులు అమ్మగా వచ్చిన డబ్బులు అందరికీ సమానంగా పంచుతామని హామీ ఇస్తున్నారు. దీన్ని కొందరు వ్యతిరేకిస్తుండగా, మరి కొందరు దక్కిందే దక్కుదల అంటూ మిన్నకున్నారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని డీఎస్పీ కె. నాగేశ్వరరావు తెలిపారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించండి

మంత్రికి ఎన్టీఆర్ కాలనీ వాసుల వినతి



తమ సమస్యలు మంత్రి పార్థసారథికి వివరిస్తున్న కాలనీ వాసులు

నరసరావుపేట: మండలంలోని ఉప్పలపాడు సమీపంలోని పీఎంఏవై ఎన్టీఆర్ కాలనీ (జగనన్న కాలనీ)లో నివాసం ఉండేందుకు మౌలిక వసతులు ముందు కల్పించాలని ఆ కాలనీ వాసులు రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథికి మొర పెట్టుకున్నారు. మంత్రి శుక్రవారం సాయంత్రం స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో కలిసి కాలనీకి వచ్చారు. ఇళ్లు, రోడ్లను మాత్రం పరిశీలించలేదు. కాలనీ ప్రవేశమార్గంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. గృహనిర్మాణశాఖ పీడీ వేణుగోపాలరావు ఆయనకు జిల్లాలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీలు, పూర్తయిన ఇళ్లు, పూర్తికావాల్సిన వాటి పరిస్థితిని వివరించారు. అనంతరం కాలనీ వాసులు తమ సమస్యలు చెప్పాలని మంత్రి కోరారు. షేక్ నాగూర్, షేక్ ఆదంబి, పిడతల రమాదేవి, త్రివేణీలు మాట్లాడుతూ కాలనీలో స్కూలు లేకపోవటంతో చాలామంది పట్టణంలో అద్దెలకు వెళుతున్నారన్నారు. వీధి లైట్లు వెలగటం లేదని వాపోయారు. మందుబాబులతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. వర్షం పడితే రోడ్లు బురదమయంగా మారుతున్నాయని, డ్రైనేజీ వ్యవస్థ లేదని ఫిర్యాదు చేశారు. తాగునీటిని ట్యాంకర్ ద్వారానైనా సరఫరా చేయాలని కోరారు. త్రివేణి అనే మహిళ మాట్లాడుతూ తమకు పట్టాలు ఇచ్చి, రూ.1.80లక్షల నగదు ఇస్తామన్నారని పేర్కొన్నారు. ఆ డబ్బుతో ఇల్లు ఎలా పూర్తవుతుందని మంత్రిని ప్రశ్నించారు. ఆ పట్టాపై ఎక్కడా రుణం ఇవ్వట్లేదని, కనీసం రూ.10లక్షలు కావాలని కోరారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద రోడ్లు వేయిస్తామని చెప్పారు. ప్రభుత్వం ఇల్లు కట్టుకునేందుకు కొంత సహాయం మాత్రమే చేస్తుందని, మిగతా సొమ్ము లబ్ధిదారులు భరించి నిర్మించుకోవాలని సూచించారు. కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని డీఈ సీహెచ్ రాంబొట్లును పిలిచి చెప్పారు. ఈ కాలనీలో 334 ఇళ్లు పూర్తయ్యాయని, ఇంకా మూడు వేలు వరకు పూర్తి కావాల్సినవి ఉన్నాయనే అధికారుల సమాచారంపై కాంట్రాక్టర్లను పిలిచి ఎప్పటిలోగా పూర్తిచేస్తారని ప్రశ్నించారు. వారు సరైన సమాధానం చెప్పలేక నీళ్లు నములుతుంటే వచ్చే ఏడాది డిసెంబరులోగా పూర్తి చేయకపోతే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన డబ్బులన్నీ నీరుగారిపోతాయని మంత్రి హెచ్చరించారు. గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.4 వేల కోట్లను వేరే పథకాలకు మళ్లించటం వలనే ఇప్పుడు తామేమీ చేయలేక పోతున్నామని పేర్కొన్నారు. కాలనీల్లో మౌలిక వసతులను కలెక్టర్ నిధులు, గృహ నిర్మాణశాఖ నిధులతో కల్పిస్తామని పేర్కొన్నారు. వచ్చే మార్చి చివరిలోగా మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. కాగా, ఒక సందర్భంలో జగనన్న కాలనీ అని మంత్రి సంబోధించటంలో ఓ కార్యకర్త ఎన్టీఆర్ కాలనీ అంటూ గుర్తుచేయటం గమనార్హం . కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఆర్డీవో మధులత, టీడీపీ నాయకులు నల్లపాటి రాము, కపిలవాయి విజయకుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

27న 'నిధి ఆప్‌కే నికత్'

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని ఈఎస్ఐసీ డీసీబీవో, కృష్ణాజిల్లా పెద్ద అవుటపల్లిలోని హైటెక్ ప్రింట్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఒంగోలులోని హెడ్ పోస్టాఫీసు ఎదుట ఉన్న పీడీసీసీ బ్యాంక్, విజయవాడ గాంధీ నగర్‌లోని ఈఎస్ఐసీ బ్రాంచ్ కార్యాలయం, బాపట్లలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల, నరసరావుపేటలోని కేరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగే నిధి ఆప్‌కే నికత్‌లో యజమానులందరూ పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.